


**ఈ ప్రపంచంలో ఎవరికి వారు బిజీ అనుకుంటారు! కానీ, తరచి చూస్తే.. రెండు బిజీల మధ్య గంటలకొద్దీ తీరిక వేళ కనిపిస్తుంది. ఒక్క అమ్మ విషయంలోనే బిజీ అనే పదానికి సరైన అర్థం ఉందనిపిస్తుంది. బిడ్డల అవసరాలు తీర్చడం కోసమే ఈ జన్మ అన్నంతగా కష్టపడుతుంది అమ్మ. ప్రతీ నిమిషం తనకు ఎదురయ్యే సవాళ్లను చిరునవ్వుతో స్వీకరిస్తుంది. పిల్లల బాగోగులు, పెద్దలను కనిపెట్టుకొని ఉండటమూ, కట్టుకున్నవాడి డిమాండ్లు నెరవేర్చడమూ ఇలా రకరకాల పనులతో రోజులు గడిపేస్తున్న అమ్మ ఆల్వేస్ బిజీ!! ఇలా మన కోసం అనుక్షణం ఆలోచిస్తూ, నిరంతరం పరిశ్రమించే అమ్మకు ఒక్క రోజన్నా థ్యాంక్స్ చెప్పడం కుటుంబ సభ్యులుగా మన బాధ్యత. మాటలతో కాదు మనసుతో చెపితేనే దానికి సరైన అర్థం!**

# అమ్మా థ్యాంక్స్!

ఈ గజిబిజీ లైఫ్ మనకు కొత్తగా పరిచయమైంది కానీ, ఎందరో అమ్మలు.. ఎప్పుడూ బిజీగానే ఉంటుంటారు. ఇల్లే ఆమె సామ్రాజ్యం. గృహిణిగా ఉన్నా, ఉద్యోగం చేస్తున్నా.. ఇంటి పనిలో మాత్రం అమ్మ ఎవరి సాయమూ ఆశించదు. పొద్దున లేవడంతోనే బిజీ అయి పోతుంది. ప్రతి ఉదయం వంటింట్లో యుద్ధమే చేస్తుంది. రోజంతా పనిలోనే ఉండి పోతుంది. కొలువులు చేస్తున్న అమ్మల సంగతి సరేసరి. కాలం కన్నా వేగంగా పరిగెత్తడం వాళ్లకు అలవాటు. ఒళ్లు నొప్పులున్నా, మనసు కలతగా ఉన్నా.. తన బాధ్యతల విషయంలో రాజీపడని మనస్తత్వమే అమ్మను ఆదిదైవానికన్నా మిన్నగా నిలిపిందేమో! అందుకే అమ్మ రుణం తీర్చుకోలేనిదంటారు పెద్దలు. అరవెయ్యి బదులిస్తేనే 'థ్యాంక్స్ బ్రో' అని చెప్పే మనం అనునిత్యం ఆమె శక్తినీ, సమయాన్నీ ధారపోసే అమ్మకు ఎన్ని కృతజ్ఞతలు చెబితే సరిపోతుంది.

### ఉరుకులు-పరుగులు

ఇల్లంతా ఆమెదే అయినా.. వంటింటితో అమ్మది జన్మజన్మల అనుబంధం. తరాలు మారినా ఈ విషయంలో మాత్రం మార్పు చోటు చేసుకోవడం లేదు. సూర్యుడి కన్నా ముందుగా మేల్కొనే అమ్మ అత్యవసరంగా అడుగుపెట్టేది వంటింట్లోనే! అప్పటికింకా భర్తగారు గాఢ నిద్రలోనే జోగుతుంటారు. మంచి ఫిల్టర్ కాఫీతో రోజు మొదలుపెడదాం అనుకున్నా.. అమ్మకు అంత వెసులుబాటు ఎక్కడిది. పొయ్యి మీద పాలు పెట్టి.. ఇల్లంతా ఊడ్చేసరికి విలువైన పదిహేను నిమిషాలు కరిగిపోతాయి. పిల్లల సుప్రభాత సేవకు సమయం ఆసన్నమవుతుంది. వాళ్లను నయానోభయానో లేపే ప్రయత్నం చేయడం, 'ఒక్క ఐదు నిమిషాలు' అంటూ వాళ్లు మళ్లీ నిద్రలోకి జారుకోవడం రివాజు. పాలు పొంగుతున్న శబ్దానికి వంటింట్లోకి పరుగుతీస్తుంది. గిన్నె అంచులు దాటక ముందే పొయ్యి ఆఫ్ చేయగలిగితే.. స్టౌ కడిగే పని తప్పిందని సంతోషిస్తుంది. ఆ హడావుడిలో కాఫీ సంగతే మర్చిపోతుంది. ఉరుకుల పరుగుల మీద స్నానం కానిచ్చేస్తుంది. వచ్చీ రావడంతోనే కూరగాయలు సిద్ధం చేసుకోవడం, ఎసరు పెట్టడం గబగబా చేయాల్సిన విధులు. ఏ మాత్రం ఆలస్యమైనా.. జీవన గడియారం లయ తప్పుతుంది. పిల్లలకు స్నాక్స్, భర్తకు టిఫిన్, రెండు వెరైటీలతో లంచ్ బాక్సులు సిద్ధం చేసేసరికి ఏడు గంటలు దాటుతుంది. ఇంతలో భర్తగారు నిద్ర లేవడం, కాఫీకి ఆర్డర్ జారీ చేయడం జరిగిపోతాయి. అప్పుడు గానీ, తను కాఫీ తాగలేదన్న విషయం అమ్మకు గుర్తుకురాదు. రెండు కప్పుల కాఫీ కలిపినా.. ఒక్కోసారి హడావుడిలో ఒక కప్పు ఒలికితే.. ఆ పూటకు కాఫీ మాఫీ అనుకుంటుంది. సవ్యసాచిలా రెండు చేతులతో ఎడతెగక పనులు చేస్తే గానీ ఎనిమిదింటి కల్లా పిల్లలను బడికి పంపడం కుదరదు. వాళ్లు అటు వెళ్లగానే గిన్నె అడుగున మిగిలి ఉన్న టిఫిన్ గబగబా తినేసి, లంచ్‌బాక్సుతో ఆఫీస్‌కు బయల్దేరుతుంది అమ్మ. భర్త, పిల్లలు బయటికి పోతే ఇంట్లో ఉండే అమ్మకేం పనుంటుంది? అనుకుంటారేమో! గృహిణి చేయాల్సిన పనులు ఉద్యోగాలు చేసే అతివల కన్నా ఒకింత ఎక్కువగానే ఉంటాయి. ఒక రకంగా ఇంటిల్లిపాదీ ఇల్లాలి మీదే ఆధారపడతారు. అందరికీ ఆమెతోనే అవసరం. అడగకుండానే ఆ అవసరం తీరిందంటే అక్కడ అమ్మ ఉందనే అర్థం. ఆమె ఒక్కో పనికీ ఒక్కో ధన్యవాదం తెలిపినా ఆ లెక్క చాంతాడుకు మించి సాగిపోతుందేమో!



### అన్నీ చిరునవ్వుతోనే..

వంటింట్లో అమ్మ నిత్యం అష్టావధానం చేస్తుంటుంది. ఆదివారాలు, సెలవు దినాలు, పండుగ రోజుల్లో అది కాస్తా మహాసహస్రావధానం స్థాయికి చేరుకుంటుంది. రాత్రి పడుకునే ముందే.. 'రేపు వడలు చెయ్యమ్మా' కూతురు కోరిక, 'మధ్యాహ్నానికి మటన్ బిర్యానీ చేయవా' అని కొడుకు అభ్యర్థన. అన్నిటికీ అమ్మ సమాధానం చిరునవ్వే! పతిదేవుడి కోరికలు అదనం. మర్నాడు మమకారం దండిగా వేసి, ప్రేమను రంగరించి.. పిల్లల కోరికలన్నీ వండి వార్చి సిద్ధం చేస్తుంది అమ్మ. మధ్యాహ్న భోజనం చేస్తూనే.. సాయంత్రం అల్పాహారం సంగతి కనిపెడుతుంది. రాత్రి భోజనంలోకి ఏం చేయాలో ఆరాలు తీస్తుంది. వంటపనులు చేస్తూనే.. ఇంటిపనులు చక్కదిద్దుతుంటుంది. అయినా సరే, ఆమె ముఖంలో కించిత్ విసుగు, కాస్త చిరాకు కనిపించే సందర్భాలు చాలా తక్కువగానే ఉంటాయి. మనం చెప్పే ముచ్చట్లన్నీ వినడానికి నిరంతరం ఆమె ముఖంలో చిరునవ్వు స్వాగతిస్తూ ఉంటుంది. ఎన్ని ఎయిర్‌హోస్టెస్ ట్రెయినింగ్‌లు తీసుకుంటే అంత ఓపిక వస్తుంది అన్నది లెక్కగట్టడం కష్టమే.

### ఒక్కరోజు సెలవు..

ఎంత అలసిపోయినా.. తన ముఖంలో ఆ ఛాయలు కనిపించకుండా జాగ్రత్త పడుతుంది అమ్మ. సెలవుల్లో కొడుకో, కూతురో, కోడలో సాయం చేస్తామన్నా.. 'ఈ పనులు నాకు కొత్తా! మీరు రిలాక్స్ అవ్వండి. చిటికెలో చేసేస్తా' అంటుంది కానీ, 'అది చెయ్, ఇది చెయ్' అని ఆర్డర్లు ఇవ్వదు. ఇన్ని చేస్తున్న అమ్మకు మనం ఏమిచ్చినా తక్కువే! అందుకే రోజూ కాదులే కానీ, వారంలో ఒక్క రోజైనా, అమ్మకు సెలవిద్దాం! అమ్మ ఒప్పుకోకపోతే.. నెలలో ఒక్క రోజన్నా హాయిగా విశ్రాంతి తీసుకోమని వేడుకుందాం! జాలి గుండె కదా.. ఒప్పేసుకుంటుంది. ఆ రోజు అమ్మను వంటింటి పరిసరాల్లోకి రానివ్వకండి. అమ్మ లేవగానే స్ట్రాంగ్ కాఫీ/ టీ పెట్టివ్వండి. తనకిష్టమైన టిఫిన్ చేసి పెట్టండి. భోజనానికి మూడు రకాలైనా సిద్ధం చేయండి. ఉప్పు, పప్పు ఎక్కడున్నాయో కన్ఫ్యూజ్ అయితే.. ఒక్కసారి వంటింట్లోకి వచ్చి వెళ్లమని చెప్పండి. వంతులు వేసుకుంటారో, ఒకరికొకరు వంత పాడుకుంటారో గానీ పనులన్నీ మీరే చక్కబెట్టండి. నాన్నను కూడా ఇన్‌వాల్వ్ చేయండి. అమ్మకు ఏదంటే ఇష్టమో ఆయనకు బాగా తెలిసే ఉంటుంది. కనుక్కొని అవకాశం ఉంటే.. ఆయనతోనే ఆ వంటకాన్ని చేయించండి. మీరు వండి వడ్డించే పదార్థాలు మీకు ఎలా ఉంటాయో గానీ, అమ్మకు మాత్రం బహు పసందుగా ఉంటాయి! ఎందుకంటే ఆమె అల్పసంతోషి. పని తప్పినందుకు తృప్తిపడే బాపతు కాదు! తన పనిని గుర్తించినందుకు అంతకన్నా కాదు! తన కోసం ఇంటిల్లిపాదీ పరితపించినందుకు!! మరి అమ్మకు కాస్త విశ్రాంతి ఇవ్వడానికీ, అందంగా ఆమెకు థ్యాంక్స్ చెప్పడానికీ ఇదీ ఓ మంచి రోజే!! అందుకే మనసు నిండా చెప్పండి...

**థ్యాంక్యూ అమ్మా!!**

### ఆదివారమూ అంతే..

ఆదివారం కాస్త ఆలస్యంగా లేచినా.. పనిలో మాత్రం అమ్మకు తేడా ఉండదు. పైగా అంతో ఇంతో పెరుగుతుంది కూడా! ఇంటాయన బాల్కనీలో నుంచి కాఫీ అంటాడు. టీవీ ముందున్న కొడుకు బూస్ట్ కోరతాడు. కాసేపయ్యాక 'సండే స్పెషల్స్ ఏమున్నాయ్?' అంటూ పిల్లాజెల్లా డైనింగ్ టేబుల్ దగ్గరికి చేరుకుంటారు. అప్పటికే అక్కడ పొగలు కక్కుతూ పదార్థాలు సిద్ధంగా ఉంటాయి. అల్పాహారం తర్వాత ల్యాప్‌టాప్ చూస్తూ పెద్దోడు.. ఫోన్ చూస్తూ చిన్నకూతురు..! కాలక్షేపం చేస్తుంటారు. పేపర్లు తిరగేస్తూనో, స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడుతూనో ఇంటాయన తాను చాలా బిజీ అనుకుంటూ ఉంటాడు. తామున్న చోటు అనువుగా అనిపించని మరుక్షణం మకాం మరో గదికి మార్చేస్తుంటారు. చేస్తున్న పని మీద విసుగొస్తే.. చిటికెలో మరో పనికి మారిపోతారు. ఇలాంటి వెసులుబాటు అమ్మకు ఉండదు. ఆదివారం అదనపు పనిని కూడా ఆనందంగా స్వీకరిస్తుంది. లంచ్‌లోకి పిల్లలు కోరిన వెరైటీలన్నీ ప్రేమగా చేసి పెడుతుంది. అమ్మ అలా ఉండబట్టే.. ఇంటిల్లిపాదీ హాయిగా మనగలుగుతున్నారు. సండే కూడా అమ్మకు ఫన్‌డే ఏం కాదు!



# న్యూయార్క్ బుక్ స్క్వేర్!

చదివే రోజులు పోయి చూసే రోజులొచ్చాయని సోషల్ మీడియాలో అందరూ చెప్పుకొంటున్నారు. ఇదేమి చిత్రమో, అదే సోషల్ మీడియాలో పుస్తక పఠనానికి సంబంధించిన విశేషాలూ వైరల్ అవుతున్నాయ్! ఎప్పుడూ స్థానిక ఉద్యోగులు, విదేశీ పర్యాటకులతో రద్దీగా ఉండే న్యూయార్క్ నగరంలోని టైమ్స్ స్క్వేర్ ఇప్పుడు పుస్తక ప్రేమికులతో కిటకిటలాడిన ఫొటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో న్యూయార్క్ నగరంలోని టైమ్ స్క్వేర్ మొదటిది. ఇక్కడి దారుల్లో నడుస్తూ క్షణం ఆగిపోతే వెనకున్నవాళ్లు ముందుకుతోసే పరిస్థితి ఉంటుంది. అలాంటి చోట వందలాది మంది కూర్చుని ప్రశాంతంగా పుస్తక పఠనం చేశారు. ఆ ప్రాంతాన్ని చూసినవాళ్లు, దాని గురించి తెలిసినవాళ్లు ఆశ్చర్యపోతున్నారు. ఆకాశహర్మ్యాల మధ్య ఉండే దారుల్లో ఎటు చూసినా కనిపించే జనం, ఆకట్టుకునే హోర్డింగులు, భారీ వీడియో స్క్రీన్లు, నియాన్ లైట్ల వెలుగు జిలుగులతోపాటు జనంతో కళకళలాడే ఈ రద్దీ ప్రదేశం ప్రశాంతంగా మారిపోవడం, పుస్తకపఠనానికి వేదిక కావడం చిత్రమే! ముందే ఇచ్చిన పిలుపు మేరకు వందలమంది పుస్తక ప్రేమికులు మంగళవారం ఉదయాని కల్లా టైమ్స్‌స్క్వేర్‌కి చేరుకున్నారు. చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్లను పక్కనపెట్టారు. వెంట తెచ్చుకున్న పుస్తకం తెరిచి చదవడం మొదలుపెట్టారు. కొంతమంది సంగీతం వింటూ పుస్తక పఠనంలో మునిగిపోయారు. ఎన్నడూ లేని ఈ వింతను చూసి ప్రజలు, పర్యాటకులూ ఎక్కడివాళ్లు అక్కడే ఆగిపోయి.. చూస్తూ ఉండిపోయారు. ఈ ఫొటోలను షేర్ చేస్తూ.. 'టైమ్ స్క్వేర్‌లో కాలం ఆగిపోయింది' అని నెటిజన్లు చేసిన పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.

# వివో మడత ఫోన్ ముచ్చట



ఇప్పుడంతా మడత ఫోన్ ముచ్చట్లే. మల్టీ టాస్కింగ్ కోసం మస్తీ ఫీచర్లలో అన్ని కంపెనీలు ఇప్పుడు ఈ ఫోల్డ్ ఫోన్ పైనే ధ్యాస పెడుతున్నాయి. వివో కూడా 'ఎక్స్ ఫోల్డ్ 4' పేరుతో మార్కెట్‌లోకి నయా మాడల్ తేనుంది. ఇప్పటికే ఆలస్యం కావడంతో, ఇప్పటి వరకూ మడత ఫోన్‌లలో లేని అడ్వాన్స్ అప్‌డేట్స్ ఇందులో పొందుపర్చింది. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో వినియోగదారులను ఆకర్షిస్తున్నది. అంతేకాదు.. దాన్ని వైర్‌లెస్‌గా ఛార్జ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నది. ఇంకా చెప్పాలంటే... రెండు అల్ట్రాసోనిక్ ఫింగర్ ప్రింట్ సెన్సర్స్ నిక్షిప్తం చేయనుంది. ఫొటోగ్రఫీ ప్రియులు మెచ్చేలా 50 మెగాపిక్సెల్ సామర్థ్యంతో మూడు కెమెరాలు ఏర్పాటుచేసింది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ఎస్ఓసీ ప్రాసెసర్ పక్కగా ఆన్‌బోర్డ్ అయ్యిందట. ఫోల్డ్ 3 తర్వాత వచ్చే వెర్షన్ అంటే ఈ మాత్రం ఉండాలి కదా మరి!!

**డోర్ మ్యాట్ దగ్గర్నుంచి డబుల్ కాట్ వరకూ.. హెయిర్ పిన్ దగ్గర్నుంచి ఫ్యాన్సీ వడ్డాణం వరకూ.. అన్నీ ఆన్‌లైన్‌లో కొంటున్నాం. ఇందులోనూ అమెజాన్ అంగడికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు! కోరుకున్నవన్నీ గుమ్మం ముందుకు తెస్తున్న అమెజాన్‌లో భిన్నమైన ఫీచర్లు చాలా ఉన్నాయి. వాటి సాయంతో మనకు కావాల్సినవి మరింత సులువుగా వెతకొచ్చు. అదెలాగో చూద్దాం.**

# అమెజాన్‌లో వెతికేద్దాం కొత్తగా!!



ఒకసారి యాప్‌లోని సెర్చ్‌బార్‌ని ట్యాప్ చేయండి. అక్కడ 'సెర్చ్ విత్ ఫొటో', 'సెర్చ్ విత్ కెమెరా' ఆప్షన్లు కనిపిస్తాయి. కొనాల్సిన వాటిని సెర్చ్‌బార్‌లో టైప్ చేసి, వాయిస్ కమాండ్స్‌తో వెతికినట్లే కొనాలనుకున్న వస్తువు పేరు తెలియకపోతే? దాన్ని ఎలా వెదకాలి? సింపుల్.. సెర్చ్ విత్ కెమెరా ఆప్షన్‌ని ట్యాప్ చేయాలి. యాప్‌లోనే ఫోన్ కెమెరా ఓపెన్ అవుతుంది. దేన్ని ఆర్డర్ చేయాలి అనుకుంటున్నారో దాన్ని ఫొటో తీస్తే చాలు.. అలాంటి ఉత్పత్తులు స్క్రీన్ మీద కనిపిస్తాయి. ఆ తరహా ప్రొడక్టులు క్షణాల్లో ముందుంటాయి.

'సెర్చ్ విత్ ఫొటో'లో ఫోన్ కెమెరాతో ఫొటో తీసి సెర్చ్ చేయడమే కాదు ఫోన్‌లో ఉండే ఫొటోల్లో ఉన్న ఉత్పత్తులు కొనాలన్నా వెతకొచ్చు. ఉదాహరణకు బ్రౌజింగ్‌లో ఇష్టమైన డ్రెస్ కనిపించింది. అది అమెజాన్‌లో ఉందేమో వెతకాలంటే ఇమేజ్‌పై ట్యాప్ చేసి షేర్ సెలెక్ట్ చేయండి. వచ్చిన షేరింగ్ ప్లాట్‌ఫామ్‌లలో 'Find Products on Amazon' ట్యాప్ చేస్తే కోరుకున్న దుస్తులు వచ్చేస్తాయి.

అగ్మెంటెడ్ రియాలిటీ తెలుసుగా! ఆధునిక టెక్నాలజీ సాయంతో బాహ్య ప్రపంచాన్ని చూడటం. ఉదాహరణకి హాల్లో పెట్టుకునేందుకు ఓ సోఫా కొనాలని అనుకున్నారు. అమెజాన్‌లో వెతికారు.. సోఫా బాగా నచ్చింది. కానీ, హాల్‌కు సరిపోతుందో లేదో తెలియదు. కాబట్టి ఆర్డర్ పెట్టాలంటే సందేహం. 'ఏఆర్'తో అది సాధ్యమే! అమెజాన్ యాప్‌లోని 'View in Your Room' ఫీచర్‌ని ట్యాప్ చేయండి. ఫోన్ కెమెరాతో హాలుని షూట్ చేయండి చాలు. మీరు సెలెక్ట్ చేసిన సోఫాను హాలులో పెట్టినట్టుగానే చూపిస్తుంది. నచ్చితే ఆర్డర్ పెట్టొచ్చు. ఇలా కుర్చీలు, ఇంటీరియర్ డెకరేషన్ ఐటమ్స్‌ని 'ఏఆర్'లో చూశాకే ఆర్డర్ పెట్టుకోవచ్చు. అయితే, ఎంపిక చేసిన ప్రొడక్టులను మాత్రమే ఇలా ఏఆర్‌లో చూసుకునే సదుపాయం ఉంది.

అమెజాన్ యాప్‌లోని మెయిన్ మెనూని ఎప్పుడైనా గమనించారా? షాపింగ్ మరింత సులభతరం చేసేలా చక్కని ఫీచర్స్‌ని జోడించింది. విభాగాల వారీగా ఉత్పత్తులు కనిపించడమే కాదు. కింద వరుసగా బటన్ ట్యాబ్స్ కనిపిస్తాయ్. ముందు 'ఆర్డర్స్' ట్యాబ్‌లో మీరు చేసిన అన్ని ఆర్డర్లనూ ఒక్క ట్యాప్‌తో పొందొచ్చు. అలాగే, కొనే వాటిలో ఉప్పు, పప్పు ఉంటే.. వాటిని ప్రతిసారీ విడిగా ఆర్డర్ పెట్టనక్కర్లేదు. సింపుల్‌గా 'Repeat Again' ట్యాబ్‌లోకి వెళ్లొచ్చు. అంతేకాదు.. సరుకుల చిట్టా ఎలాగైతే రాసుకుంటామో.. Lists ట్యాబ్‌లో మనకు కావాల్సిన వస్తువుల జాబితా రాసుకోవచ్చు. ఇలా రాసుకుంటే వాటికి సంబంధించిన బెస్ట్ డీల్స్‌ని అమెజాన్ మనకు తెలియజేస్తుంది. ఆఫర్ నచ్చితే వెంటనే ఆర్డర్ పెట్టేయొచ్చు.

ఏ వస్తువైనా రివ్యూలు చూసి, ఓకే అనుకుంటేనే ఆర్డర్ చేస్తుంటాం. ఇకపై అమెజాన్‌లో వస్తువులకు సంబంధించిన క్రేజ్‌ని తెలిపేందుకు మూడో పేరామీటర్ వచ్చింది. 'సేల్స్ ట్రెండ్ డేటా' పేరుతో ఆ వస్తువును ఎంత మంది కొన్నారో తెలియజేస్తుంది. దాని ఆధారంగా వస్తువుకు ఉన్న క్రేజ్ ఆధారంగా ఆర్డర్ పెట్టొచ్చన్నమాట.

# మణికట్టుకు పువ్వు జట్టు!

అతివల అలంకారంలో మణికట్టు నగలది ప్రత్యేక స్థానం. పద్ధతిగా గాజులు వేసుకునే ఆడవాళ్ల నుంచి బ్రేస్‌లెట్లు పెట్టుకునే కాలేజీ అమ్మాయిల దాకా... ఎవరి అభిరుచిని బట్టి వాళ్లు ముంజేతిని ముచ్చటగా ముస్తాబు చేసుకునేవాళ్లే. అలవాటును బట్టి మరో చేతికి వాచీని ధరించేవాళ్లు మరి కొందరు. ఆ ఇష్టాన్ని అనుసరిస్తూ, అసలైన పూల సోకునే చేతి గొలుసుల్లో బంధించి ఇస్తున్నారు డిజైనర్లు. 'రియల్ ఫ్లవర్ బ్రేస్‌లెట్లు' ఇప్పుడు ఫ్యాషన్ మార్కెట్లో కొత్త సరకు. మన దగ్గర పూసే గులాబీలు, రంగురంగుల చామంతులు, చిన్ని పొద్దుతిరుగుడు పువ్వులే కాక లేస్, మిస్టిక్ ఫ్లవర్... ఇలా రకరకాల విదేశీ పూలతోనూ వీటిని తయారు చేస్తున్నారు. నిజమైన పువ్వుల్ని ప్రత్యేక పద్ధతుల్లో నిల్వ చేసి, పారదర్శక రెజిన్‌లో వీటిని ఉంచి ఫ్రేమ్ కట్టి ముచ్చటైన బ్రేస్‌లెట్లు రూపొందిస్తున్నారు. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో పాటు బంగారు పూత పూసినవీ ఇందులో దొరుకుతున్నాయి. ఇష్టాన్ని బట్టి బ్రేస్‌లెట్‌లా, వాచీలా దీన్ని పెట్టుకోవచ్చు. రోజువారీ ముస్తాబులోనూ పూల సోకుకు చోటివ్వచ్చు!









